సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 7 । డిసెంబర్ । 2024



తడి చెత్త.. మార్పు కొత్తగా..

భద్రాచలం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తడి చెత్తతో బ్రిక్స్ (ఇటుకలు) తయారు చేసే మిషన్ ఏర్పాటు చేస్తున్నారు. 8లో



....క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం, రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వారెంట్లు అమలు పర్చాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంఅర్బన్: గంజాయి, పాత కేసుల్లో వారెంట్లు అమలు పర్చాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జామీనుదారులకు నోటీసులు ఇవ్వాలని, ముద్దాయిలకు సమన్లు త్వరితగతిన అందజేయాలని సూచించారు. గంజాయి కేసుల్లో ఇతర రాష్ట్రాల వారికి బెయిల్ మంజూరు చేయకూడదన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో కొత్తగూడెం కోర్టులు, మణుగూరు, ఇల్లెందు కోర్టుల్లో జరుగుతున్న, చేపట్టబోయే అదనపు నిర్మాణాలపై సమీక్షించారు. జడ్జిలు బత్తుల రామారావు, ఏ.సుచరిత, కే.సాయిశ్రీతోపాటు పీపీడీ. లక్ష్మి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

భద్రాద్రికి 'నవోదయ'ం

- జవహర్ నవోదయ విద్యాలయ మంజూరు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎట్టకేలకు నవోదయ విద్యాలయ మంజూరైంది. తెలంగాణకు మొత్తం ఎనిమిది నవోదయ స్కూళ్లు మంజూరుకాగా, వాటిలో ఒకటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో 1986లో కేంద్రం జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజనకు ముందు జిల్లా యూనిట్‌గా ఈ జవహర్ విద్యాలయాలు ఉండేవి. ఖమ్మం జిల్లాకు సంబంధించి పాలేరులో నవోదయ ఉంది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌తో ఇక్కడ విద్యనందిస్తారు. జిల్లాల విభజన తర్వాత కొత్త జిల్లా యూనిట్‌గా నవోదయ మంజూరు చేయాలంటూ కేంద్రానికి అనేక సార్లు తెలంగాణ సర్కారు విజ్ఞప్తి చేసింది. 2016లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడితే 2024 చివరన నవోదయ కేటాయిస్తూ ప్రకటన వచ్చింది. జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయాన్ని ఎక్కడ నెలకొల్పుతారనే అంశంపై త్వరలో స్పష్టత రానుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి క్లాసులు ప్రారంభమయ్యే అవకాశముంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో ఈ పాఠశాలలు నడుస్తాయి.

రాష్ట్రస్థాయి టోర్నీకి ఏర్పాట్లు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో త్వరలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలల నుంచి సుమారు 1,800 మంది క్రీడాకారులు హాజరయ్యే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ పాపారావు తెలిపారు. దీంతో జోజర్లతో క్రీడా ప్రాంగణాలను చదును చేయిస్తున్నారు. కాగా, క్రీడా మైదానాల రూపకల్పన పనులను విద్యార్థులతో చేయిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

అన్నదాతకు ఆర్థిక తోడ్పాటు

బోనస్ చెల్లింపుతో ప్రభుత్వం అన్నదాతకు ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. కౌలు రైతులకూ లబ్ధి చేకూరుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మద్దతు ధరతోపాటు బోనస్ కూడా అందుతుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈసారి వరి సాగులో సన్నరకాల విస్తీర్ణం కూడా పెరిగింది. – బూర్గంపాడు

సన్న రకం వడ్లకు బోనస్ చెల్లిస్తున్న ప్రభుత్వం

- క్వింటాల్‌కు రూ. 500 చొప్పున జమ
- కొనుగోలు కేంద్రాలకు పోటెత్తుతున్న ధాన్యం
- కౌలు రైతులకూ దక్కుతున్న ఫలాలు

బూర్గంపాడు మార్కెట్‌యార్డులో సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు



ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో గురువారం వరకు 20,577 క్వింటాళ్ల సన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. 2,340మంది రైతుల నుంచి కొనుగోలు చేయగా, ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ 38.66 కోట్ల నగదు జమచేసింది. ఇక క్వింటాల్ ధాన్యానికి రూ.500 చొప్పున రూ.3 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ అయింది. ప్రైవేటు వ్యాపారులకు అమ్మినవారు బోనస్ నష్టపోతున్నారు.

80శాతానికి పైగా సన్నరకాలే సాగు

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.80 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇందులో 80శాతానికి పైగా సన్నరకాలే వేశారు. గతంలో మొత్తం విస్తీర్ణంలో దొడ్డు రకాలను మూడు వంతులవరకు సాగుచేసేవారు. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో సన్నాల సాగుకు మొగ్గు చూపారు. ప్రభుత్వం గ్రేడ్ 'ఏ'రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 చెల్లిస్తోంది. కాగా జిల్లాలో 166 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని వానాకాలం సీజన్‌లో అందించలేదు. దీంతో రైతులు సాగు పెట్టుబడులకు నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు రైతులకు రుణమాఫీ కావటంతో మళ్లీ పంటరుణాలు తీసుకుని పెట్టుబడులకు వాడుకున్నారు. ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ కాకపోవటంతో ప్రైవేటు అప్పులు చేయాల్సి వచ్చింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఈ ఏడాది వరి దిగుబడులు కూడా తగ్గాయి. ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడులు రాలేదు. ఈ తరుణంలో ప్రభుత్వం అందిస్తున్న బోనస్ రైతులకు కలిసి వచ్చింది. ఎకరాకు కనీసంగా రూ.10 వేల వరకు బోనస్ రూపంలో రైతులకు ఆర్థిక చేయూత అందినట్లయింది. దీంతో రైతులు దిగుబడులు తగ్గినా ప్రభుత్వం ఇస్తున్న బోనస్‌తో ఒడ్డున పడ్డారు.

కౌలు రైతులకు చేయూత

ఇక బోనస్ కౌలు రైతులకు బాగా కలిసివచ్చింది. పంటల పెట్టుబడి సాయం కింద అందించే రైతు భరోసా పట్టాదారు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి వెళ్తుంది. కౌలు రైతులకు అందులో ఎలాంటి సాయం అందటం లేదు. ప్రభుత్వం సన్నరకం వడ్లు పండించిన రైతులకు బోనస్ అందించటంతో కౌలు రైతులకు కూడా ధాన్యం నగదుతో పాటుగా ప్రభుత్వం అందించే బోనస్ వారి బ్యాంకు ఖాతాల్లో జమఅవుతోంది. దీంతో చాలా ఏళ్ల తరువాత ప్రభుత్వం నుంచి నేరుగా తమకు ఆర్థిక సాయం అందుతుందని కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు సగం మేర కూడా వరికోతలు పూర్తి కాలేదు. ఈ నెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలకు ముమ్మరంగా ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

కొనుగోళ్లు వేగంగా..



జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు సన్న రకం ధాన్యమే ఎక్కువగా వస్తోంది. కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతోంది. ఆ తర్వాత మూడు రోజులకు బోనస్ పడుతోంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి.

–రుక్మిణీదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రామయ్య దాసుడికి నీరాజనం

- ఘనంగా తూము నర్సింహదాసు జయంతి ఉత్సవం
- హాజరైన నర్సింహదాసు వంశీయులు, కీర్తనల సీడీ ఆవిష్కరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధిలో భక్త రామదాసు తర్వాత అంతటి కీర్తి గడించిన ప్రముఖ వాగ్గేయకారుడు శ్రీ రాజా లక్ష్మీనరసింహదాసు. ఆయన 234వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరిపారు. తొలుత ఆస్థాన విద్వాంసుల కీర్తనలతో, అర్చకులు మంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ ప్రధాన ఆలయం నుంచి తూము నరసింహదాసు చిత్రపటంతో ఊరేగింపుగా భద్రగిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం విస్తా కాంప్లెక్స్ వద్ద నున్న నరసింహదాసు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కీర్తనల సీడీ ఆవిష్కరణ

తూము నర్సింహదాసు రచించిన కీర్తనలకు గాయకుడు పార్థసారథి స్వరకల్పన చేసిన సీడీలను ఆలయ ప్రాంగణంలో నర్సింహదాసు వారసుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామయ్య సన్నిధిలో ఆయన దాసుడు కీర్తనల ఆవిష్కరణలో పాల్గొనటం ధన్యమని పేర్కొన్నారు. వంశీయులను దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, అర్చకులు, పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కోటి టెండర్లు ఖరారు

జనవరి 9,10వ తేదీల్లో జరగబోయే తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి టెండర్లను దేవస్థానం ఈఓ రమాదేవి ఖరారు చేశారు. ప్రధాన ఆలయం, పర్ణశాల, గోదావరి ఘాట్‌ల వద్ద పెయింట్ పనులకు రూ. 9.5 లక్షలు, గోపురం, నిత్యకల్యాణ మండపం, వైకుంఠ ద్వారం, గోశాలల పంచ రంగులకు రూ.5.75 లక్షలు, చలువ పందిళ్ల నిర్మాణానికి రూ.4.64 లక్షలు, స్వాగత ద్వారాలకు రూ.4.90 లక్షలు, పూల డెకరేషన్‌కు రూ.8.19 లక్షలకు టెండర్లు ఖరారు చేశారు. వీటితోపాటు ఇతర అభివృద్ధి పనులు కలుపుకుని మొత్తంగా రూ.52,59,170 కు గుత్తేదారులకు అప్పగించారు.



నరసింహదాసు విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



కీర్తనల సీడీ ఆవిష్కరణలో పాల్గొన్న వంశీయులు, ఆలయ అధికారులు

స్వర్ణ కవచధారణలో రామయ్య..

దేవస్థానంలో అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణకవచ ధారులై దర్శనమిచ్చారు. నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

అశ్వారావుపేటరూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. మండలంలోని మల్లాయిగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం గ్రామాల్లో నాబార్డు సహకారంతో వాసన్ సంస్థ పర్యవేక్షణలో జీవ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గిరిజన రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పీఓ శుక్రవారం సందర్శించారు. దిగుబడులు, లాభాలు, సాగు పద్ధతుల వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. జీవామృతం తయారీని, కూరగాయాల పెంపకం, నాటు కోళ్లు, గేదల ఫాంలు, పశుగ్రాసం, పూల మొక్కలు, చేపల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విస్తరణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులకు సూచించారు. గోగులపూడి కొండరెడ్ల ఆర్థిక అభివృద్ధికి గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద రూ.10 లక్షల వ్యయంతో నాటు కోళ్ల ఫాం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏపీఓ ఉదయ్ భాస్కర్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏఓ శివరాం ప్రసాద్, ఎంపీఓ శివరాం ప్రసాద్, ఉద్యాన అధికారి వేణు మాధవ్, ఐటీడీఏ డీఈఈ బాపనయ్య, ఏఈఈ ప్రసాద్, ఆర్ఐ కృష్ణ, వాసన్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీష్ కుమార్, సభ్యులు దారా ప్రసాద్, కొర్రి మల్లయ్య, జమ్మి జయరాజు పాల్గొన్నారు.



జీవామృతం తయారీని పరిశీలిస్తున్న పీఓ రాహుల్

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేశారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు.

సొసైటీల అభివృద్ధికి కృషి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సొసైటీల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి సహకార అభివృద్ధి కమిటీ(డీసీడీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని, అజొల్లా, పశుగ్రాసం పెంపకంపై దృష్టి సారించాలని ఆదేశించారు. మత్స్య శాఖాధికారులు మహిళలకు చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వాలని, 150 చేపల పెంపకం యూనిట్ల స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. మొక్కజొన్న ఆకుల ద్వారా దాణా తయారీ పరిశ్రమ స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుల కింద పత్తివిత్తనాల నుంచి నూనె సేకరణ పరిశ్రమ, చేపల దాణా పరిశ్రమ, పాడి పరిశ్రమ, కమ్యూనిటీ పశువుల షెడ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, డీఏఓ బాబూరావు, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, జిల్లా పశుసంవర్ధక అధికారి పురంధర్, మత్స్య శాఖాధికారి ఇంతియాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

పిల్లల సంరక్షణ అందరి బాధ్యతని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం నిర్వహించిన జిల్లా బాలల సంరక్షణ యూనిట్ (డీసీపీయూ) సమావేశంలో మాట్లాడారు. జిల్లాను బాల కార్మిక రహితంగా మార్చాలన్నారు. కోళ్లఫామ్‌లు, ఇటుకబట్టీలు, షాపింగ్‌మాల్ తదితర చోట్ల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. బాలల సంరక్షణ గృహం మణుగూరు నుంచి జిల్లా కేంద్రానికి తరలించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. బాలల సంరక్షణ గృహంలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసుల వివరాలను తనకు అందించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, సీపీఓ సంజీవరావు, డీడబ్ల్యూఓ లెనినా, బీసీ సంక్షేమాధికారి ఇందిర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

హోంగార్డుల పనితీరు ప్రశంసనీయం

కొత్తగూడెంఅర్బన్: పోలీసు శాఖలో హోంగార్డు ఆఫీసర్ల పనితీరు ప్రశంసనీయమని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎంఏ ఫంక్షన్ హాలులో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై శాంతి కపోతాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ వరదలు, ఎన్నికల సమయంతోపాటు రోజువారీ విధుల్లో కూడా హోంగార్డులు అంకిత భావంతో సేవలందిస్తున్నారని తెలిపారు. త్వరలో ఉద్యోగ విరమణ పొందనున్న 9 మంది హోంగార్డు ఆఫీసర్లకు బహుమతులు అందజేశారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురికి ప్రశంసాపత్రాలను అందజేశారు. తొలుత కేక్ కట్ చేశారు. అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, డీఎస్పీలు సత్యనారాయణ, రెహమాన్, సతీష్ కుమార్, సీఐలు నాగరాజు, సంజీవ్ కుమార్, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, సురేష్, ఇంద్రాసేనారెడ్డి, ఆర్ఐలు నరసింహారావు, లాల్ బాబు, సుధాకర్, కృష్ణారావు, రవి పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు

కొత్తగూడెంఅర్బన్: గత అక్టోబర్ 21న పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజు తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్సై, ఆపై అధికారుల విభాగంలో మొదటి బహుమతిని అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్, రెండో బహుమతిని షీ టీమ్ రమాదేవి, మూడో బహుమతిని ఆర్‌ఎస్‌ఐ జగన్మోహనాచారి గెలుచుకున్నారు. కానిస్టేబుల్-ఏఎస్‌ఐ విభాగంలో డీసీఆర్‌బీ ఏఎస్‌ఐ రఘురాములు మొదటి బహుమతిని, కొత్తగూడెం వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామ్‌దాస్ రెండో బహుమతిని, టేకులపల్లి కానిస్టేబుల్ ఉపేందర్‌రావ్ మూడో బహుమతిని సాధించారు. విద్యార్థుల విభాగంలో కొత్తగూడెం ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థిని కారున్య మొదటి బహుమతిని, పాల్వంచలోని శ్రీ సాయి స్ఫూర్తి డీఏసీ స్కూల్ విద్యార్థిని యువతేశ్వరి రెండో బహుమతిని గెలుచుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

పేదలకు గృహయోగం..

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- జిల్లాలో సోమవారం నుంచి ఇంటింటి సర్వే
- మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయనున్న సిబ్బంది
- 'ప్రజాపాలన'లో ఇళ్ల కోసం సుమారు 2,79,638 దరఖాస్తులు



ఇందిరమ్మ ఇంటి నమూనా

చుంచుపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ పథకంలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసేందుకు మొబైల్ యాప్‌ను రూపొందించారు. శుక్రవారం నుంచి యాప్ అందుబాటులోకి రాగా ఐటీ టీం పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి డౌన్‌లోడ్ చేసి యూజర్ ఐడీలు క్రియేట్ చేస్తున్నారు. యాప్‌పై పూర్తి అవగాహన కల్పించాక సోమవారం నుంచి దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేయనున్నారు. ఇప్పటికే అర్హులను గుర్తించేందుకు ప్రతి గ్రామం, వార్డుల వారీగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నెల రెండో వారం నాటికి లబ్ధిదారులకు ఉత్తర్వులు విడుదల చేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. తొలివిడతలో సొంత స్థలం ఉన్నవారికే ఇళ్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. అర్హుల ఎంపికను త్వరితగతిన చేపట్టి ప్రజాపాలన ఏడాది ఉత్సవాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో సొంతింటి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రత్యేక యాప్‌లో నమోదు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను యాప్ ద్వారానే గుర్తిస్తారు. యాప్‌తోపాటు ప్రభుత్వం మూడు ఇళ్ల ఆకృతులను రూపొందించింది. తక్కువ స్థలంలో రెండు గదులు, వంటగది, బాత్రూం వంటివి ఉండేలా ఇంజనీర్లు ఆకృతులను ఇందులో పొందుపరిచారు. కాగా ప్రజాపాలన పేరుతో గతేడాది డిసెంబర్‌లో జిల్లా వ్యాప్తంగా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో వివిధ పథకాలకు 3,33,225 దరఖాస్తులు రాగా, వాటిలో దాదాపు 85 శాతం అనగా 2,79,638 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్లవే ఉన్నాయి.

దరఖాస్తుల ఆధారంగా...

సర్వే సిబ్బంది ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు అధికారి ద్వారా సర్వే జరుగుతుంది. అనర్హులకు ఇళ్లు మంజూరు కాకుండా ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నారు. దరఖాస్తుదారుడు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం ఇళ్లు నిర్మించుకోవడానికి భూమి అందుబాటులో ఉందా, లేదా.. స్థలం లబ్ధిదారుడి పేరు మీద ఉందా? లేక కుటుంబ సభ్యుల పేరు మీద ఉందా? ప్రస్తుత గ్రామం, పట్టణంలో ఎన్నేళ్లుగా నివసిస్తున్నారు? తదితర వివరాలు సేకరించనున్నారు. లబ్ధిదారుల్లో దివ్యాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, పారిశుద్ధ్య కార్మికులకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, వారిని యాప్ ద్వారానే గుర్తించనున్నారు. ఇక ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో ఇంటిని నిర్మించుకున్న వారికి మొత్తం మూడు దశల్లో నిధులు విడుదల చేస్తారు. లబ్ధిదారుడు వ్యక్తిగతంగా బేస్‌మెంట్ లెవల్ పూర్తి కాగానే మొదటి విడత నిధులు విడుదలవుతాయి. ఇలా ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా మరో రూ.లక్ష ఇవ్వనున్నారు.

క్లుప్తంగా

9న సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికకు ఈ నెల 9న పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీలకు వయసు ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్‌కు సద్వినియోగం చేసుకోవాలి


లాజిస్టిక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామారావు

అశ్వాపురం: సురక్షితంగా, తక్కువ సమయంలో సామగ్రి, పార్శిళ్ల చేరవేస్తున్నందున టీఎస్ ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం) రామారావు సూచించారు. మణుగూరు ఆర్టీసీ డిపో పరిధి అశ్వాపురంలో ఏర్పాటుచేసిన లాజిస్టిక్స్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రం ద్వారా తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు పార్శిళ్లు, కవర్లు, పచ్చి సరుకును వేగంగా, తక్కువ ధరలకు పంపించవచ్చన్నారు. అంతేకాక ఏపీలోని ముఖ్య పట్టణాలు, మహారాష్ట్ర, బెంగళూరుకు కూడా పార్శిళ్లు చేరవేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సేల్స్ టీం లీడర్ కె.హరివర్మ, ఎగ్జిక్యూటివ్‌లు బి.హనుమ, బి.రవికుమార్, ఏజెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏసీ బస్సు చార్జీల్లో 10 శాతం తగ్గింపు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి నడుస్తున్న ఏసీ బస్సు చార్జీల్లో 10 శాతం తగ్గించినట్లు డిపో మేనేజర్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తున్న ఆర్టీసీని మరింత చేరువ చేసే క్రమాన టికెట్ ధరలో బేసిక్‌పై పది శాతం తగ్గించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిర్ణయం 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. అయితే, ప్రస్తుతం చలికాలం కావడంతో ఏసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య తగ్గడంతో ఆక్యుపెన్సీ రేషియో పెంచేలా అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

చివరిరోజు 67 ఓట్లు

కొత్తగూడెంఅర్బన్: రైల్వే శాఖలో దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో భాగంగా భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో మూడో రోజైన శుక్రవారం 67 ఓట్లు పోల్ అయ్యాయి. రైల్వే ఇనిస్టిట్యూట్ పక్కన పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో 625 మంది కార్మికులు, ఉద్యోగులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడో రోజు శుక్రవారం 226 మంది ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 67 మంది మాత్రమే ఓటు వేశారు. మిలిగిన 159 మంది ఓటు వేయలేదు. ఈ ఎన్నికల్లో దక్షిణమధ్య రైల్వే కార్మిక సంఘం, రైల్వే మజ్దూర్ యూనియన్, ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్లు పోటీలో ఉన్నాయి. బీడీసీఆర్ స్టేషన్ పరిధిలో 851 మంది కార్మికులు, ఉద్యోగులకు ఓటు హక్కు ఉండగా మూడు రోజుల్లో 692 మంది మాత్రమే ఓటు వేశారు. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 12వ తేదీన ఫలితాలు వెల్లడించనున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెనుబల్లి: మండలంలోని టేకులపల్లిలో రేషన్ బియ్యాన్ని వీఎం బంజర్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పేదల వద్ద కొనుగోలు చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గ్రామంలోని ఖాళీ ఇంట్లో మిట్టపల్లి శేషగిరిరావు నిల్వ చేశాడు. ఈమేరకు తనిఖీలు చేపట్టిన పోలీసులు స్వాధీనం చేసుకుని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జయంతి గ్రామానికి చెందిన రామారావుకు విక్రయించడానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. దీంతో శేషగిరిరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

97 కిలోల గంజాయి పట్టివేత


వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం: ఒడిశా నుంచి గంజాయి తీసుకొస్తున్న ఇద్దరిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ అశోక్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ధర్మారం గ్రామానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బెజంగివాడకు చెందిన ఖగపతి ధకడ్ ఆంధ్రా – ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఈసందర్భంగా చేపట్టిన తనిఖీల్లో వారిని అదుపులోకి తీసుకుని రూ.24.లక్షలకు పైగా విలువైన 97.62 కేజీల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

తడి చెత్త.. మార్పు కొత్తగా..


గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీసీ షెడ్డు

- తడి చెత్తతో బ్రిక్స్ తయారీకి రంగం సిద్ధం
- ప్రారంభానికి సిద్ధంగా డీఆర్సీసీ షెడ్డు
- ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహణ
- రాష్ట్రంలోని జీపీల్లో భద్రాచలంలోనే తొలి యూనిట్
- ఎట్టకేలకు చెత్త సమస్యకు పరిష్కారం


పనివిధానాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సుధీర్, ఈఓ శ్రీనివాసరావు

భద్రాచలంఅర్బన్: ఎన్నో ఏళ్ల నుంచి చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న భద్రాచలం పట్టణ ప్రజలు ఇక నుంచి ఊపిరిపీల్చుకోవచ్చు. ఏపీ, తెలంగాణ విభజన తర్వాత దశాబ్దకాలంగా డంపింగ్ యార్డు లేక గోదావరి ఒడ్డున ఓ ఖాళీ స్థలంలో చెత్తను వేయడంతో పరిసర ప్రాంతకాలనీల్లో ఉండే పజలతో పాటు పర్యాటకులు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. అయితే, చెత్త నుంచి వచ్చే దుర్వాసన, చెత్తను కాల్చిన తరువాత వచ్చే పొగ కారణంగా అవస్థ పడుతున్న దుస్థితి నుంచి చెత్త నుంచి సంపద సృష్టించే పరిస్థితి రానుంది. భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.80 లక్షల వ్యయంతో పట్టణ శివారు మనుబోతుల చెరువు వద్ద 8.5 ఎకరాల్లో డీఆర్‌సీసీ షెడ్‌ను నిర్మించారు. రెండు నెలల కిందటే అందుబాటులోకి రావాల్సిన ఈ డీఆర్‌సీసీ గతంలో భద్రాచలం ఐటీడీఏ పీఓగా పనిచేసిన ప్రతీక్‌జైన్.. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ కావడం.. అనంతరం ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ ఐటీడీఏ పరిధిలో ఉన్న ఇతర సమస్యలపై దృష్టి పెట్టడంతో ఆలస్యమైంది. శుక్రవారం యంత్రాన్ని భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించారు. పూర్తిస్థాయిలో అన్ని పరికరాలను బిగించి మరో వారం, పది రోజుల్లో మంత్రులతో ప్రారంభించనున్నారు.

రూ.53 లక్షలతో విద్యుత్‌లైన్ ఏర్పాటు..!

డంపింగ్ యార్డులో పొడి, తడి చెత్తను వేరు చేసే యంత్రాలు పనిచేసేందుకు అవసరమైన విద్యుత్ లైన్ ఏర్పాట్లు పూర్తి కాగా, ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు వద్ద పనులు జరిపేందుకు రూ.53 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో 10 శాతం వరకు గ్రామపంచాయతీ నిధులు చెల్లించి, వీరి సొంత ఖర్చులతో చేయాల్సిన పనులను పూర్తి చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే డంపింగ్‌యార్డు వద్ద భారీ పోల్స్ ఏర్పాటు చేసి, 100 కేవీ లైన్ నిర్మించారు. ఈ డంపింగ్ యార్డులో ఉన్న మిషనరీతో పాటు పరిసర ప్రాంతకాలనీలో ఉన్న ప్రజలకు కూడా ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచే విద్యుత్ సరఫరా కానున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, డంపింగ్‌యార్డులో తడి చెత్తతో బ్రిక్స్ తయారు చేసే మిషనరీకి సామర్థ్యాన్ని బట్టి చూస్తే కేవలం ఇప్పుడు ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ లైన్ డంపింగ్ యార్డుకే వినియోగించాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

లక్షల ఖర్చుతో..

భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో రోజూ ఉత్పత్తి అయ్యే చెత్తను వేరు చేసేందుకు గాను డీఆర్‌సీసీని నిర్మించగా.. వీటిలో ఏర్పాటు చేసే మిషనరీకి రూ.60 లక్షలు వెచ్చించారు. తడి చెత్త నుంచి బ్రిక్స్ తయారు చేసేందుకు ఆఫీసర్లు హైదరాబాద్‌లోని పీర్జాదిగూడ మున్సిపాల్టీని సందర్శించి, అక్కడ తడి చెత్తతో బ్రిక్స్ తయారు చేసే విధానాన్ని పరిశీలించి, అక్కడే తయారైన బ్రిక్స్‌ని కూడా పరీక్షించారు. పీర్జాదిగూడ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న మిషనరీని భద్రాచలం గ్రామ పంచాయతీ కోసం రూ.60 లక్షలు వెచ్చించి తెచ్చారు. భద్రాచలం డీఆర్‌సీసీలో మొత్తం నాలుగు మిషన్లు ఏర్పాటు చేస్తుండగా, వీటిని ప్రస్తుతం దంపింగ్ యార్డులో బిగిస్తున్నారు. భద్రాచలం గ్రామపంచాయతీలో 16 వేల ఇండ్లు ఉన్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి రోజుకు 27 వాహనాల ద్వారా 15 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. డంపింగ్‌యార్డు పూర్తయ్యాక మరో 5 వాహనాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇదిలాఉండగా నూతనంగా నిర్మించిన డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను యంత్రాల ద్వారా క్రషింగ్ చేసి ఎరువులుగా ఉపయోగించనున్నారు. ఇలా చేయడం ద్వారా నెలకు రూ.5 లక్షల ఆదాయాన్ని పంచాయతీ సాధించనుంది. రోజూ వచ్చే చెత్తలో 10 టన్నుల తడి చెత్తను బ్రిక్స్‌గా మార్చనున్నారు. కేవలం 24 గంటల్లోనే ఇవి తయారవుతాయని అధికారులు చెబుతున్నారు.

తడి చెత్తతో బ్రిక్స్ తయారీ..

భద్రాచలం గ్రామపంచాయతీలో తడి చెత్తతో బ్రిక్స్ (ఇటుకలు) తయారు చేసే మిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని హోటళ్లలో ధాన్యం ఊకకు బదులుగా పొయ్యిలో ఉపయోగిస్తారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ హీట్ ఇచ్చే వీటిని పొయ్యిలో వినియోగించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తడి చెత్త నుంచి బ్రిక్స్ తయారు చేసే యూనిట్ కేవలం హైదరాబాద్‌లోని పీర్జాదిగూడ మున్సిపాల్టీలో మాత్రమే ఉంది. భద్రాచలంలో ఏర్పాటు చేసేది రెండో యూనిట్. కాగా రాష్ట్రంలో ఈ యూనిట్ ఉన్న ఏకైక పంచాయతీగా భద్రాచలం రికార్డులెక్కనుంది. అయితే ఈ బ్రిక్స్‌ను భద్రాచలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో వంట చేసేందుకు ఉచితంగా అందజేసి వారి నుంచి పుస్తకాలను ఉచితంగా సేకరించనున్నారు.

వారం రోజుల్లో ప్రారంభిస్తాం



కొన్ని అనివార్య కారణాలతో డంపింగ్ యార్డు ప్రారంభం ఆలస్యమైంది. వచ్చే వారం రోజుల్లో డీఆర్‌సీసీని జిల్లాకి చెందిన రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్, భద్రాచలం ఐటీడీఏ పీఓ, భద్రాచలం ఎమ్మెల్యేతో పాటు సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభిస్తాం. ఎన్నో ఏళ్లుగా భద్రాచలం పట్టణ ప్రజలు చెత్త సమస్యతో ఇబ్బంది పడుతుండగా దానికి పరిష్కారం లభించనుంది. డీఆర్‌సీసీతో గ్రామ పంచాయతీకి ఆదాయం కూడా వస్తుంది. ప్రజలంతా తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి.

–శ్రీనివాసరావు, ఈఓ, భద్రాచలం జీపీ

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడామైదానాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే జారె

- ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే ఆదినారాయణ
- అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో క్రీడా మైదానం ప్రారంభం

దమ్మపేట: విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లోనూ రాణించాలని.. తద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని భద్రాచలం ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్, అశ్వారావుపేట ఎమ్మె ల్యే జారె ఆదినారాయణ వెల్లడించారు. దమ్మపేట మండలం అంకంపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ఖో–ఖో ఆడించడమే కాక వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఓ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలలల్లో మౌలిక వసతుల కోసం ఎమ్మెల్యే జారే కృషి చేస్తున్నారని తెలిపారు. మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ క్రీడా మైదానానికి అవసరమైన స్థలాన్ని అందజేసిన వగ్గెల జనార్ధనరావు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఎమ్మెల్యే కోటా నిధుల్లో అత్యధికంగా విద్యా రంగానికి రూ.4 కోట్లు మేరకు కేటాయించానని చెప్పారు. దమ్మపేట మార్కెట్ చైర్మన్ వాసం రాణి, ఐటీడీఏ డీడీ మణెమ్మ, జిల్లా క్రీడల అధికారి గోపాల్, ఏటీడీఓ చంద్రమోహన్, హెచ్‌ఎం శారద, పీఈటీ నాగమణితో పాటు పైడి వెంకటేశ్వరరావు, కొర్సా సాగర్, వాసం శ్రీను, వేణు పాల్గొన్నారు.


విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న పీఓ రాహుల్

లక్ష్యసాధనకు కృషిచేయాలి

భద్రాచలంటౌన్: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేలా శ్రద్ధగా చదవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్ ఎన్ఐటీలో ఇంజనీరింగ్ చేస్తున్న ఇల్లెందు మండలం భూపేష్‌నగర్ తండా గ్రామానికి చెందిన వాంకుడోత్ వర్షిణికి శుక్రవారం పీఓ ల్యాప్‌ట్యాప్ అందజేసి మాట్లాడారు. ఏపీఓ డేవిడ్ రాజ్, ఏఓ రాంబాబు, విద్యార్థి తల్లి భారతి పాల్గొన్నారు. కాగా, భద్రాచలం గోపాలకృష్ణ థియేటర్ ఎదురుగా ఐటీడీఏ సహకారంతో నెలకొల్పిన ఓం శక్తి మల్టీ ప్రొడక్ట్స్ ఆహార పదార్థాల షాపును పీఓ ప్రారంభించి మాట్లాడారు. గిరిజన, ఆదివాసీ మహిళలు జొన్నలు, రాగులు, తేనె, ఇప్పపూలతో చేసే ఆహార పదార్థాల అమ్మకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రూప్ సభ్యులు సుధారాణి, కమల, వసుంధర, విజయదుర్గ, సీతారామలక్ష్మి, అనసూర్య, రాజ్యలక్ష్మి, సీహెచ్.కమల, శీలం దుర్గ, వెంకటలక్ష్మి, తిరుపతమ్మ, కృష్ణవేణి, జయమ్మ పాల్గొన్నారు.

చోరీల కేసులో నిందితుడు అరెస్టు

రూ.8.68లక్షల సొత్తు స్వాధీనం


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రెహమాన్

మధిర: మధిర పట్టణంతో పాటు మండలంలోని మడుపల్లి, ఆత్కూరు తదితర గ్రామాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు వైరా ఏసీపీ రెహమాన్ వెల్లడించారు. మధిర సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మడుపల్లికి చెందిన బండి గోపి కారు డ్రైవర్‌గా పనిచేస్తూనే డీజే సౌండ్ సిస్టమ్ నిర్వహిస్తున్నాడు. అయితే, సులువుగా డబ్బు సంపాదించేలా మధిర పట్టణం, పరిసర గ్రామాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈక్రమాన మధిర టౌన్ ఎస్ఐ–2 ఎస్. చంద్రశేఖర్ ఆత్కూరు క్రాస్ వద్ద తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో వెంబడించి పట్టుకుని విచారించగా బండి గోపిగా తేలింది. ఆయన మధిర సుందరయ్య నగర్, లడక బజార్, మడుపల్లి, ఆత్కూరు, ఏపీలోనిఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని పెనుగొలను, వత్సవాయిల్లో 9 చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు నిందితుడి నుంచి రూ.8.68లక్షల విలువైన 15 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదు, రెండు కెమెరాలు, సీసీ టీవీ డీవీఆర్ స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంతో సొత్తు రికవరీచేసిన పోలీస్ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మధిర సీఐ డి.మధు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రూ.1.5 కోట్ల విలువైన ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ల ఏర్పాటు

ఏన్కూరు: మండలంలోని జన్నారం సబ్‌స్టేషన్‌లో అదనంగా రూ.కోటిన్నర విలువైన ట్రాన్స్‌ఫార్మర్, రెండు ఫీడర్లు ఏర్పాటు చేసినట్లు డీఈ ఎల్.రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. లో ఓల్టేజీ సమస్య నివారణకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయగా ఇకపై వ్యవసాయ మోటార్లకు సమస్య తలెత్తదని చెప్పారు. డీఈ భద్రు, ఏడీఈ రమేష్, ఏఈఓ సతీష్, ఏఈ ఉమకాంత్ పాల్గొన్నారు.


కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అధికారులు

ఐదుగురు వ్యక్తుల అరెస్ట్

మణుగూరుటౌన్: మద్యం సేవించి పోలీసులను దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురు వ్యక్తులను మణుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సీఐ సతీశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. మూడు రోజుల కిందట పూలమార్కెట్ వద్ద రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ రంజిత్, బ్లూకోల్ట్స్ సిబ్బంది వీరతో కొరివి చంద్రశేఖర్, తక్యం గోపీచంద్, ముక్కర సాయికుమార్, చిటికెన రామకృష్ణ, నువ్వుల వంశీ మద్యం సేవించి వాగ్వాదానికి దిగారు. పోలీసులను దుర్భాషలాడారు. విధులకు ఆటంకం కలిగించడంతో ఎస్ఐ రంజిత్ దరఖాస్తు మేరకు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

మందుబాబులకు జరిమానా

భద్రాచలంఅర్బన్: మద్యం సేవించి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన 48 మందికి భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ శుక్రవారం జరిమానా విధించారు. అదే విధంగా మరో ఇద్దరికి మూడు రోజుల పాటు జైలుశిక్షను విధించారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

అశ్వారావుపేటరూరల్: అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడటంతో పలువురు గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఆరుగురు కూలీలు ధాన్యం బస్తాలను ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం మేడేపల్లికి చెందిన ఓ రైతు ఇంట్లో దిగుమతి చేసి తిరిగి వస్తున్నారు. కొత్తూరు గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో కొత్తూరుకు చెందిన పిట్టా వీరభద్రం తీవ్రంగా గాయపడ్డాడు. మరో ముగ్గురికి స్వల్ప గాయలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరభద్రంను ఖమ్మంకు తరలించారు. ఇంకా ఫిర్యాదు రాలేదని స్థానిక ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

బైక్ చోరీ కేసులో నిందితులు..


నిందితులు, బైక్‌తో పోలీసులు

పాల్వంచ: మోటార్ సైకిల్ చోరీ చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని జీసీసీ గోడౌన్ వద్ద శుక్రవారం ఎస్ఐ సుమన్ వాహన తనిఖీలు చేపట్టగా.. పాల్వంచకు చెందిన సాయికుమార్, కార్తీక్, రాము యమహా మోటార్ సైకిల్‌పై అనుమనాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కేటీపీఎస్ బొంబేకాలనీలో ఇంటి ఎదుట పార్క్ చేసిన యమహా మోటార్ సైకిల్‌ను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దీనిని విక్రయించేందుకు యత్నిస్తున్న క్రమంలో పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుమన్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మారాయిగూడెం తాలుకా పొటకబిన్ గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటనపై కేసు నమోదు చేశామని సీఐ అశోక్ శుక్రవారం తెలిపారు. మహేశ్ మూడు రోజుల కిందట ఇంటి నుంచి మరికొందరు విద్యార్థులతో కలిసి పాఠశాలకు వెళ్లి అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. సదరు విద్యార్థి భద్రాచలం వచ్చి ఇక్కడే తిరుగుతున్నట్లు సమాచారం ఉందని, ఆచూకీ తెలిసిన వారు 95732 48096 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. విద్యార్థికి ఒక చేయి మాత్రమే ఉంటుందని చెప్పారు.

ఆర్‌టీసీ బస్సును వెనక నుంచి ఢీకొట్టిన ట్రాక్టర్

కామేపల్లి: ఆర్‌టీసీ బస్సును ట్రాక్టర్ వెనక నుంచి ఢీకొట్టిన ఘటన మండలంలోని కామేపల్లి క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బస్సు కామేపల్లి క్రాస్ వద్ద ప్రయాణికుల కోసం ఆగింది. అదే సమయాన బాసిత్‌నగర్ గ్రామపంచాయతీ ట్రాక్టర్ వెళ్తూ అదుపుతప్పగా బస్సును వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోగా కుదుపుతో ఏం జరిగిందోనని ప్రయాణికులు ఆందోళన చెందారు. ఈఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రెండు మట్టి టిప్పర్లు సీజ్

ఏన్కూరు: సామర్థ్యానికి మించి మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను సత్తుపల్లి ఎంవీఐ శ్రీనివాసరావు సీజ్ చేశారు. మండలంలోని గార్లఒడ్డులో శుక్రవారం గుట్టల నుంచి వైరా ప్రాంతానికి సామర్థ్యానికి మించి మట్టి తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

బాలాపేట వద్ద...

ఖమ్మంఅర్బన్: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. బాలాపేటకు చెందిన శ్రీను టిప్పర్‌లో మట్టి లోడు చేసుకొస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

గుండాల: చెట్టుకు ఉరేసుకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన చింత నరసింహారావు, లక్ష్మి దంపతుల కుమారుడు మహేశ్ (18) గురువారం నుంచి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు శుక్రవారం పరిసర ప్రాంతాలను పరిశీలించగా గుట్టబోడు ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఉన్నాడు. ఆళ్లపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

మనస్తాపంతో పురుగులమందు తాగి వ్యక్తి..

జూలూరుపాడు: మండలంలోని గురువాగుతండాకు చెందిన ఓ వ్యక్తి ఒంటరి జీవితం గడపలేక మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా.. పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన బోడా భద్రు (62) గురువారం సాయంత్రం కాకర్ల గ్రామంలోని రైస్ మిల్లు సమీపంలో పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులకు ఆయన్ను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, శుక్రవారం మృతి చెందాడు. భార్య కాంతి రెండేళ్ల కిందట చనిపోవడంతో భద్రు ఒంటరిగా ఉంటున్నాడు. మనస్తాపంతో పురుగులమందు తాగి చనిపోయినట్లు మృతుడి కుమారుడు బోడా నరసింహారావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

పిల్లికి సీమంతం !


అలంకరణలో పిల్లి (సాషా)

మధిర: మధిరలోని సీపీఎస్ రోడ్డులో నివసిస్తున్న అల్లూరి నాగభిక్షం – పద్మ దంపతుల ఆధ్వర్యాన శుక్రవారం పిల్లికి సీమంతం నిర్వహించారు. నాగభిక్షం ఇంట్లో ఆర్‌టీసీ మధిర డిపో కండక్టర్ అబ్బాస్ కుటుంబం అద్దెకు ఉంటోంది. వీరి పెంచుకుంటున్న పిల్లి నాగభిక్షం దంపతులకు మచ్చిక అయింది. సాషా పేరిట పెంచుకుతున్న పిల్లి ప్రస్తుతం గర్భంతో ఉండగా నాగభిక్షం – పద్మ ఆధ్వర్యాన బంధుమిత్రులను ఆహ్వానించి సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లిని గాజులు, గొలుసులు, పూలదండ, డ్రెస్‌తో అలంకరించి వడి నింపే కార్యక్రమాలన్నీ నిర్వహించారు.

ఆర్టీసీ బస్సులో వస్తుండగా చోరీ

మధిర: మధిరకు చెందిన పసుమర్తి శ్రీనివాసరావు సతీమణి విజయలక్ష్మి వద్ద బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆమె ఓ ఫంక్షన్‌కు హాజరై శుక్రవారం వైరా నుంచి ఆర్టీసీ బస్సులో మధిరకు వస్తున్నారు. బ్యాగ్‌లో బంగారు వడ్డాణం, నగలు ఉండగా, ఆమె పక్కన కూర్చున్నవారు చోరీ చేసినట్లు తెలిసింది. కాసేపటికి బ్యాగ్‌లో చూసుకోగా ఆభరణాలు లేకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని మధిర టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బోనకల్‌లో...

బోనకల్: మండల కేంద్రంలోని మల్లెల నాగేశ్వరావు ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గుర్తించిన దుండగులు తలుపులు పగలగొట్టి రూ.30వేల విలువైన టీవీ, రూ.20వేలు విలువైన వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అలాగే, మండలంలోని చిరునోములలో బొడెపూడి స్వరూపారాణి ఇంటి తలుపులు ధ్వంసం చేసి రూ.75వేలు నగదు, రూ.25విలువైన వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

అశ్వాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారి వెంట మతిస్థిమితం లేని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తి రెండు రోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేక అశ్వాపురంలో తిరుగుతున్నాడు. అమెర్ద రహదారి వెంబడి పడిపోయి ఎవరూ గమనించక మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ తిరుపతిరావు మృతదేహాన్ని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురిలో భద్రపరిచారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడు...


అశోక్ (ఫైల్)

సుజాతనగర్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై టూటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గరీబ్‌పేట గ్రామానికి చెందిన నున్నా అశోక్ (24) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయన తల్లిదండ్రులు నాగేశ్వరరావు, ఉషారాణి బుధవారం హైదరాబాద్ వెళ్లగా అదేరోజు పొలం వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. గమనించినవారు కొత్తగూడెం, ఖమ్మం ఆస్పత్రులకు.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అశోక్ మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడి సోదరి సౌజన్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, మృతుడి సోదరి సౌజన్య వివాహం ఈ నెల 14న జరగాల్సి ఉండగా.. అశోక్ మృతితో విషాదం అలుముకుంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి...

పెనుబల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లకు చెందిన బైర్ల బాలాజీ(62) ఈనెల 3న వీఎం బంజర్ నుండి ద్విచక్రవాహనంపై కుప్పెనకుంట్లకు వెళ్తుండగా బయ్యన్నగూడెం వద్ద హైవేపై బారికేడ్లు తాకడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈమేరకు బాలాజీ కుమారుడు వెంకటనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.